# అవునా! దొంగనేనా...!

"దొంగల కథలు' అని స్పెషల్ ఫీచర్ వేద్దామండీ సరళా" అన్నాడు మా ఎడిటర్.

"అవునా! దొంగనేనా? అన్న కాప్షన్ ఖాయం చేయండి" అన్నాడు మళ్ళా నేనేమీ అనకుండానే.

"దొంగ వెధవ దొంగ కాకుండా ఏమైపోతాడు?' అనే ప్రశ్న పూర్తి చేశానో లేదో విజయగర్వంతో చూశాడాయన నా వంక. ఆయన దృష్టిలో ఆయన లెక్కెప్పుడూ కరక్టే. నేనీ ప్రశ్న అడుగుతానని ఆయన ముందే ఊహించినట్లు ఓ ఫీలింగ్ ఇచ్చాడు మొదట.

"వస్తున్నా....వస్తున్నా" అంటూ అరచేతి ముద్రవేసి చూపాడు.

"ఆ వేసే ఎస్సైన్‌మెంట్ ఏదో మన మొహాన్ని పారేస్తే బాగుండు కానీ ఆయనలా చేయడే" నీ అజ్ఞానపు లోతుపాతులు నాకు కరతలామలకం. అరటిపండు వలిచినట్టు నే చెబుతాగా" అని మనసులో నిశ్చయం చేసేసుకొని ఇంటి గుమ్మం దాటతాడనుకొంటా. "మన రిపోర్టర్లకి మెస్సేజిచ్చా. మీ దాపున వున్న జైళ్ళలో దొంగలతో ఇంటర్వ్యూ తీసుకొని అసలు వాళ్ళెందుకు దొంగలయ్యారో కిటుకు తెలుసుకోమన్నా. ఇంట్రస్ట్ కొద్దీ క్వశ్చనీర్ నేనే రాసిచ్చాననుకోండి. ఇదిగోండి. రిప్లయ్" అంటూ నా ముందో ఫైలు పెట్టాడు. ఫైల్‌లో వున్న దొంగల ఆత్మఘోష బరువుగానే ఉంది. "రాత్రి పది గంటలకు మొదలు పెట్టి చదువుతున్నా ఇప్పటిదాకా అదే పని. మనసు మనసులో లేకుండా పోయింది. ఇవండి అసలైన కథలు" అన్నాడాయన కళ్ళల్లో నీళ్ళు తెచ్చుకొని. దానికాయన ఆర్ద్రత అని పేరు చెప్పాడు గతంలో.

"ప్రతి దానికీ ఏడుస్తాడేమిటి అసయ్యంగా" అంటుంది వనజ. ఆ ఏడుపులంటే దానికి వళ్ళుమంటట.

"అది ఏడుపుకాదు. ఆయన గుండె కరిగీ...." అని మనం చెప్పబోతే వినదు. "వెధవ ఏడుపులేనట" ఇక దాన్నేం మారుస్తాం.

"సరే ఓ సారి చదివి చూస్తానండి" అన్నా ఫైలు పుచ్చుకొని.

"అన్నీ రీరైట్ చేయండి. మంచి లీడ్ రాయండి" అన్నాడాయన కళ్ళజోడు తగిలించుకొని.

ఆ దొంగల నెత్తుకొచ్చి నేను సీట్లో కూర్చున్నా.

"దొంగలు దొంగలేనా" అన్నది వనజ నవ్వాపుకుంటూ.

నేను రాకముందే వీళ్ళంతా విన్నారన్నమాట.

"లీడ్ నువ్వయితే బాగా రాస్తావని రాంబాబు, నేనూ అందరం కలిసి చెప్పాం. మొన్న వచ్చిన నీ కథ సగం చదివి విన్పించి మరీ రుజువు చూపాడు భాస్కరం."

అందరూ విరగబడి నవ్వారు.

వళ్ళు మండిపోతోంది. అసలు వీళ్ళ కంటే దొంగలెవరు? ఫైల్ తెరుస్తూనే 'అమ్మ కోసం' కాప్షన్..." నేను మొట్టమొదట దొంగతనం చేసింది మా అమ్మకోసం.

ఓ దొడ్లో ఆరేసిన వాయిల్ చీర పట్టుకుపోదామనుకున్నా...." కథ మామూలే. ఆ ఇంటివాళ్ళు పట్టుకొని చితక్కొట్టారు. ఆ ఇంటివాళ్ళ పదేళ్ళ పాప 'మా అమ్మకి ఈ ఒక్క చీరే వుంది. ఇంక చీరల్లేవు' అందిట. దెబ్బల మధ్య దొంగకి ఈ ముక్క చెవిలో పడింది. మనసు భాదేసిందిట. దానిమీద మా రిపోర్టరు తన సొంత అవగాహనకొద్దీ చీరలు నేయటం దగ్గరనుంచి మగ్గాలు సొంతంగా లేక కూలి వాళ్ళయిపోయిన సాలెవాళ్ళ దగ్గర దాకా టోటల్‌గా దేశంలో చీరల పరిశ్రమను కవర్ చేసి ఏదో ముగింపు ఇచ్చాడు.

నేను తలెత్తి చూసేసరికి "చచ్చావా! అన్నది వనజ."

"ఇప్పుడే కేన్సరొచ్చింది నెమ్మదిగా చస్తాను" అనేసి పేడ్ ముందుకు లాక్కున్నా. ఒక నేరానికి సౌందర్యీకరణ - తప్పుని తప్పనిసరిగా చెప్పకుండా అసలది తప్పే కాదని మాయచేయడం. రిపోర్టర్ రాసిన లీడ్ బాగానే వుంది.

ఆ కుర్రాడి దృష్టిని ఆకర్షించిన లేలేత ఆకుపచ్చని చీర. చీరనిండా పరచుకొన్న పచ్చని ఆకుల వరసలు....

మొఖం తిరిగిపోయింది. గుప్పెడంత గుండె తలుపు ఎప్పుడు ఎలా తెరుచుకుందో వెనక్కి వెనక్కి గతంలోకి కొత్తగా నేనడుగుపెట్టిన యవ్వనంలోకి. అస్తమానూ వోణీ సర్దుకోవడం, ఆవోణీ దాచిన గుండెను చూసుకోవడం, రంగు రంగుల బట్టల చుట్టూ, చిన్న చిన్న సరదాల చుట్టూ అదేపనిగా మనసు ఆలోచిస్తూ... ఇంటి

ముంగిట్లో అమ్మ అప్పుడే ఆరేసిన షిఫాన్ చీర, లేత వన్నె వైలెట్ కలర్ మీద ముదురు రంగు చిన్న చిన్న ఆకులున్న మెత్తని చీర. వరండాలో కూర్చుని చదువుకుంటున్న ఆడదొంగ కళ్ళన్నీ ఆ చీరపైనే. కావాలని అడిగితే ఎప్పుడూ కాదనని అమ్మే భరోసా. కానీ కావాలని చెప్పకుండా అమ్మ చేత పనులు చేయించుకోగలిగే కంత్రీతనం ఆ చీరను మధ్యకు మడిచి వోణీలాగా వేసుకొన్న బుల్లి దొంగ. అమ్మ లోపలినుంచి వచ్చింది. వోణీ వేసుకొన్న ఆడదొంగను చూసి అమ్మ కళ్ళు మిలమిలలాడాయి. ఎంత మంచి ముఖం. ఎంత దయగల కళ్ళు. బిడ్డ దుర్మార్గం ఎరగని కళ్ళు. "ఎంత బావున్నావో ఇలా రా" అంది అమ్మ.

"నాకు బావుంది కదూ" అంది దొంగ.

"చించి నే వోణీలు చేసుకుంటా" అన్నది గారాబంగా దొంగ.

"స్కూలుకు కట్టేందుకు మంచి చీరలు లేవు కదమ్మా" అన్నది అమ్మ. అమ్మ రోజూ కట్టే ముతక చీరలు వంటికి చుట్టుకుపోతూ బావుండవు. అమ్మకున్న మంచి చీర ఇదొక్కటేనని దొంగకు తెలుసు. అటు తర్వాత అమ్మ కంటపడేలా ఇప్పుడూ ఆ చీర చుట్టుకొని, పైటలాగా వేసుకొని అద్దంలో తిప్పుకొంటూ చూసుకొని.....

అమ్మ ఇక తట్టుకోలేకపోయింది. దొంగ స్కూలు నుంచి వచ్చేసరికి చీర ముక్కలయింది. ఒక పరికిణీ, ఒక వోణీ. అమ్మనడక్కుండానే దోచుకోవచ్చు.

లాంతరు వెలుగులో అమ్మ అన్నాలు పెడుతుంది. దొంగ తండ్రి డాకూ అవుతాడా, గజదొంగ అవుతాడా, అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అధినేత అవుతాడా? ఏమో మరి మా నాన్న మటుకు అవుతాడు. గిన్నెలో చాలా కూర గజదొంగకు, మిగిలింది దొంగకు. అమ్మ గిన్నె అవతల పెట్టేసరికి తెలిసిపోయింది. అందులో ఏమీ ఉండదని "నీకు" అన్నది దొంగ అన్నం తింటూ, "పోనీ, నీవు సగం వేసుకో" అని గజదొంగ అనలేదు, దొంగా అనలేదు. అమ్మ చారన్నమే తిన్నది.

పొద్దున్నే... ఎప్పుడూ వర్క్ ఉంటూనే వుంటుంది దొంగకు. అమ్మ పనిచేసే స్కూలు ఇక్కడికి ఆమడ దూరం. రెండు గంటల ప్రయాణం. బట్టలూ, అంట్లూ, వంటా, టిఫిన్లు, బాక్సుల సర్దుడూ.... అమ్మ బొంగరం మల్లే తిరుగుతున్నా వర్క్ ఓ అరగంట ప్రక్కన పెట్టి ఎవ్వరం అమ్మకి సాయం చేసింది లేదు. వంటింటి గుమ్మం దగ్గరే ఏదో ఒక గిన్నెలో పిడికెడు మెతుకులు ఆదరా బాదరా కలుపుకొంటూ నోటిలో కుక్కుకొంటూ పొయ్యి మీద పొంగిబోతున్న పాలగిన్నెవైపు, టిక్కుటిక్కుమని ఆగకుండా తిరిగే గడియారం వైపు బిక్కు బిక్కుమంటూ చూసే అమ్మ దొంగకు నిత్యానుభవం. రోజూ ఈ చారన్నమేనా,

ఎప్పుడూ ఈ గోంగూరా పప్పేనా? అంటూ దొంగ చేసే గారాబానికి లాలించే టయమే లేక మా బంగారానివి కదా, మా కన్నవి కదా అంటూ అమ్మ చీర కట్టుకుంటూ, చిల్లరా, పెన్నూ వెదుక్కుంటూ, తాళం చెవులకోసం దేవులాడుకుంటూ పరుగుపెట్టడం ఎప్పటి అనుభవమే. అమ్మ చెవుల్లో ఎప్పుడూ బస్ హారన్ విన్పిస్తుందట.

చాలాకాలంపాటు జీతంలేని ఉద్యోగం చేశాక అమ్మ పనిచేసే స్కూల్‌కి ఎయిడ్ వచ్చింది. అమ్మ చాలా నెలల జీతం ఒకేసారి చేతికి వచ్చింది. అంటే నాన్న చేతికి అన్నమాట. ఇవి ఫిక్స్‌డ్‌లో వేస్తే పాపాయి పెళ్ళికి సరిపోతాయి అన్నాడు నాన్న. అవునంది అమ్మ. దేనికీ కాదనదు.

"నేను స్కూలుకి వెళ్ళలేకపోతున్నాను. బస్సుల్లో అలసిపోతున్నాను. రోజూ నాలుగు గంటల ప్రయాణంతో హూనమై పోతున్నాను". "పోనీ ప్రజ్ఞా వాళ్ళు కొత్తగా స్కూలు పెట్టారు. వెయ్యిస్తానన్నారు చేరిపోనా" అన్నది అమ్మ.

"ఫరవాలేదు సరిపెట్టుకోగలిగితే" ప్రజ్ఞా వాళ్ళ స్కూలు నాలుగురోజులు నిలబడేదేనా? అయినా నాకెందుకులే. అవునూ నీతోటి టీచర్లుకూడా ఇలా టౌన్ నుంచే వెళతారు కదా. సరే నీవు నిర్ణయించుకొన్నావు కదా అన్నాడు గజదొంగ.

అమ్మకు భయం వేసింది. 'ప్రజ్ఞా వాళ్ళు సరిగ్గా నడపలేరంటారా. పోనీ పాత స్కూలే కంటిన్యూ చేయనా. అసలు మీరేమనుకుంటున్నారు' అన్నది అమ్మ భయం భయంగా. వెళ్ళే టీచర్లకు స్కూటర్లు వున్నాయ్. నాలా బస్సుల్లోపడి రారు. నేను వెళ్ళలేకపోతున్నాను అని అన్లేదు అమ్మ.

చిక్కిపోతున్న అమ్మగాని, అమ్మ నీరసం గాని, భయంగాని గజదొంగ పట్టించుకోనేలేదు.

నేనేమంటాను. సరిపెట్టుకోగలిగితే నీ ఇష్టం. అమ్మ ఆలోచిస్తోంది. మొత్తం ఇంటిపనీ, సర్వచాకిరీ తనే చేస్తుంటే ఇంకేం సరిపెట్టుకోలేకపోవడం. కాకపోతే పదేళ్ళనుంచీ అవే పనులు చేసీ చేసీ....

"కష్టమైపోతుందండీ"

"నీ ఇష్టం మరి" గజదొంగ మంచం మీద వాలిపోయాడు. మానుకుంటే పోలా. నే మానుకుంటే సరిపోతుందా. నాకు ధైర్యం ఇస్తే బాగుణ్ణు. పని చేయలేకపోయినా నేనున్నానని కాస్త ప్రేమ ఇస్తే బాగుణ్ణు. నీరసంగా వుంది. భయంగా వుంది.

అమ్మ మాట్లాడితే ఇవే మాట్లాడి వుండేదేమో!

చాపమీద పడుకున్నా. అమ్మ కళ్ళమీదగా వేసుకున్న తెల్లని చేయి, దానిమీద

నల్లని గాజులు, తెల్లని పల్చని మెడలో వదులుగా పడున్న నల్లపూసలు. అమ్మ కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

పడుకొన్న పక్క ఎందుకో చల్లగా తోచింది. ఆ పొద్దుటే అరుగుమీద కూర్చుంది అమ్మ. మబ్బులు పట్టిన ఆకాశంలా వుంది అమ్మ మొఖం.

"పని మానెయ్యవే అమ్మా, ఎల్లాగో సర్దుకొందాం" అన్లేదు దొంగ. వచ్చేవారం ఎక్స్‌కర్షన్ వుంది, ఇవ్వాళ ఎల్లాగయినా సిన్మాకి పోవాలి. దొంగ చూపుల్ని అమ్మ పసిగట్టేసింది.

"ఏం కావాలి బంగారూ..."

"అమ్మా మరేనేమో...."

కాదని నొప్పించే కరకుతనం అమ్మకెప్పుడూ లేదు.

రిటైర్ అయ్యే వరకూ అమ్మ స్కూలు, ఇంట్లో చాకిరీ చేస్తూనే వుంది. రోజుకో వన్నె పెంచుకుంటూ దొంగా, తీరిక తీరికగా అనుభవిస్తూ గజదొంగా... ఎప్పటికీ తీరని చాకిరితో అమ్మా. అమ్మ పి.ఎఫ్... గ్రాట్యుయిటీలో దొంగకి మంచి మొగుడు... మంచి ఉద్యోగం. కొన్ని గంటలు చాలా తేలికైన కష్టం పడితే కొన్ని వేలు తేలికగా చేతిలో పడే ఉద్యోగం. వెచ్చని జీవితం... వెనక కొలిమిలా అమ్మేనా!

అమ్మ ఇప్పుడూ పని చేస్తూనే ఉంటుంది. ఇప్పుడే ఇంకా కొత్త కొత్త చాకిరీలు, గజదొంగ రిటైర్ అయ్యారు. ఆయనకు పాపం అనారోగ్య భయం. అతి జాగ్రత్తల మధ్య హుషారైన రిటైర్‌మెంట్ జీవితం. ఉదయం, సాయంత్రం మార్నింగ్‌వాక్‌లు, ఉప్పు, కారం తగ్గించి చేసే కూరలు, రాత్రిళ్ళు సరిగ్గా అన్నీ వేళకు... పల్చని చపాతీలు, జ్యూస్‌తో సహా. అమ్మ ఇవన్నీ విశ్రాంతి లేకుండా చేస్తూనే ఉంటుంది. అయినా తీరుబడిగా ఉంటే ఆవిడకు తోచదట. నిముషం తీరుబడిగా వుంటే ఏవేవో గుర్తుకొచ్చి మనసు కంగారైపోతుందిట. శరీరం, మనసూ అలసిసొలసిపోయేదాకా పన్లు చేస్తూనే ఉంటేనే ఆవిడ బతకగలుగుతానంటుంది. అమ్మ అర్థం కాలేదా? లేదు. అర్థం చేసుకొనే ప్రయత్నం ఎప్పుడూ జరగనేలేదు. అమ్మేమిటో అర్థం చేసుకొనే అవకాశం అసలా ఇంట్లోనే దొరకలేదు. గజదొంగ పొద్దుటే ఫోన్లో పలకరించాడు. ఒకే వూర్లో వుంటున్నా ఎప్పుడో కానీ కలుసుకోం. 'ఎల్లావున్నావు నాన్నా' అన్నది దొంగ.

'వండ్రఫుల్' అన్నాడు గజదొంగ.

'అమ్మేం చేస్తోంది...'

'వంటింటి చూరు పట్టుకుని వేలాడుతోంది' గజదొంగ చాలా ఫన్నీగా మాట్లాడాననుకొని చాలాసేపు నవ్వాడు.

'అబ్బ, అమ్మెప్పుడూ అంతే... నాకుమల్లే ఉత్సాహంగా ఉండవచ్చుగదా... బొత్తిగా ఇనాక్టివ్ అయిపోతోంది' అన్నది దొంగ.

అస్తమానం ఆ పుస్తకాలూ, ఏదో పరీక్షకు చదివినట్టు, పెయింటింగ్‌లు... ఇప్పుడు కొత్తగా సంగీతం ప్రాక్టీస్ చేస్తోంది.

గజదొంగ నవ్వు నిజంగానే బానే వుంది.'వయొలిన్ మీద కమాన్‌తో లాగితే గుండెని మెలిపెట్టినట్లుంటుందే బంగారూ. అసలు కొన్ని రాగాల వరసల్లో వేదన ఉంటుంది. నాకయితే ఎందుకో అన్ని రాగాలూ వేదనగానే పలుకుతాయే...' అందోసారి అమ్మ.

'ఆవిడ తాలూకూ చాలా పోయాయి' అన్నారు దొంగ లోపల్నించి ఎవరో.

"ఆవిడ వస్తువులా! ఏవై ఉంటాయి' అంది లోపల తొంగి చూసుకోవటానికి ప్రయత్నిస్తూ దొంగ. లోపలంతా కటిక చీకటి. తన లోపల తనకోసం ఏం దాచుకుందో, తనను ఆనందపెట్టే సంపద, చివరకు తన మనసన్నా లోపల ఉందో లేదో...."

"అమ్మ జీవితం మొత్తం పోయింది. ఆమె ఆశలు, ఆమె ప్రేమంతా... చివరకు ఆమెంతా...! ఆమె ఎంత ప్రేమించగలదో.... ఏమి దొరికిందో!" చీకటిలోంచి మళ్ళీ చిన్నగా ఎవరో అరిచారు. దొంగ తలదించుకుంది.

'ఏమిటో ఆలోచిస్తున్నావు... అన్నది వనజ. పిటిఐ, యుఎన్ఐ మిషన్లు టపటప మంటూ విరామం లేకుండా కొట్టుకుంటున్నాయి. మధ్య మధ్యని ఓ నిముషం ఆగుతూ. ఎవరూ పలకరించకపోతే మళ్ళీ కొట్టుకుంటూ... కాస్తంత దయకోసం, ప్రేమకోసం అమ్మగుండెలిలా కొట్టుకొనేవా! ఆగి.... ఆగి ఎదురు చూసేవా... అమ్మ యంత్రం అయిపోవటానికి ఇప్పుడు ప్రయత్నం చేస్తూనే ఉందా!

దొంగ కళ్ళల్లో నీళ్ళూరాయి.

'ఎందుకే ఏడుస్తావూ. ఏడ్చే వాళ్ళే దొంగలు' అన్నది వనజ.

ఇంటర్‌కమ్ మోగింది. ఎడిటర్‌గారు

'దొంగల కథ వెళుతుందా! సప్లిమెంట్ ఫస్ట్‌పేజీ బాటమ్‌లో బాక్స్ వేయండి. అది రేపటినుంచి రెగ్యులర్ కాలమ్. ఫస్ట్ పేజీలో ఇన్‌ప్రింట్ ఒకటి వేయించండి?'

"అవును సార్..... దొంగల కాలమ్ నేనే చూస్తా సార్... 'ఔనా నేను దొంగనేనా?' క్లిక్ అవుతుంది సార్! అన్నాను.

'వెరీగుడ్' అన్నారు ఎడిటర్‌గారు." ☼

*'ఆంధ్రజ్యోతి' డైలీ 29 నవంబర్ 1998*